# గుట్టలో భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

- లక్ష్మీనరసింహులకు వైభవంగా నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, నవంబర్15 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా వ్రత పూజల్లో భక్తులు పాల్గొని తరించారు. బుధవారం ప్రధానాలయంతోపాటు పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కార్తీక మాస వేడుకలు విశేషంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేకువజామునే కొండపైన దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ కింద సత్యనారాయణ స్వామి వ్రత మండపం సందడిగా మారింది. 152 మంది దంపతులు వ్రత మాచరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో దీపారాధన చేపట్టారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన అత్యంత వైభవంగా జరిగింది. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతు జరిపారు. సాయంత్రం స్వామివారికి వెండి మొక్కు, దర్బార్ సేవలు చేపట్టారు. రాత్రి స్వామి వారికి తిరువరాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. రాత్రి ప్రధానాలయ ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన నిర్వహించారు. మణవాళ మహాముని తిరునక్షత్రోత్సవం అత్యంత వైభవంగా సాగింది. రెండో రోజులో భాగంగా తొళక్కం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. స్వామివారిని సుమారు 13 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.18,26,930 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు.



యాదగిరిగుట్టలో నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

# అభివృద్ధికి మద్దతుగా బీఆర్ఎస్‌లో చేరికలు

- బీఆర్ఎస్ మిర్యాలగూడ అభ్యర్థి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు
- కాంగ్రెస్, సీపీఎం నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

దామరచర్ల, నవంబర్ 15 : మండలంలోని పలు తండాల్లో ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో కొత్తపేటతండాకు చెందిన 20 కుటుంబాలు, గోన్యాతండాకు చెందిన 25 కుటుంబాలు కాంగ్రెస్, సీపీఎం నుంచి ఎమ్మెల్యే భాస్కర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే భాస్కర్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు మద్దతుగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం మరింత సుభిక్షంగా మారనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, జడ్పీటీసీ ఆంగోతు లలితాహతీరాం, సర్పంచ్ శాంతి, ఎంపీటీసీ వీరూనాయక్ పాల్గొన్నారు.


# కాంగ్రెస్‌ను బొంద పెడుదాం.. వ్యవసాయాన్ని కాపాడుదాం

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి
- కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరిక

యాదగిరిగుట్ట, నవంబర్15 : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టి వ్యవసాయాన్ని కాపాడుకుందామని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలోని 9వ వార్డు కౌన్సిలర్ దండెబోయిన అనిల్‌యాదవ్‌తోపాటు 300 మంది నాయకులు, గుండాల మండలం మాసాన్‌పల్లికి చెందిన 100 మంది కాంగ్రెస్ నాయకులు, ట్రాక్టర్ యూనియన్ నాయకులు, తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లికి చెందిన 100 మంది ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్ నాయకులు, ఆత్మకూరు(ఎం) మండలం లింగరాజుపల్లికి చెందిన 100 మంది కాంగ్రెస్ నాయకులు, బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లికి చెందిన 100 మంది కాంగ్రెస్ నాయకులు, బొమ్మలరామారం మండల కేంద్రంలోని 100 మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంటు చాలంటున్నాడని, అదే అజ్ఞానం, అహంకారంతో రైతులపై కాంగ్రెస్ పార్టీ విషం చిమ్ముతుందని దుయ్యబట్టారు. 3 గంటల కరెంటు చాలంటున్న కాంగ్రెస్ కావాలో, 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్న బీఆర్ఎస్ కావాలో రైతులు ఆలోచన చేయాలన్నారు. కాంగ్రెస్ అంటే ప్రజలకు గోస అని, బీఆర్ఎస్ అంటే భరోసా అని స్పష్టం చేశారు. పదేండ్లలో చరిత్రలో నిలిచిపోయే సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్‌గౌడ్, కల్లూరి రామచంద్రారెడ్డి, పల్లెపాటి సత్యనారాయణ, చామల ఉదయచందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుధాహేమేందర్‌గౌడ్, వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్లు తాళ్లపల్లి నాగరాజు, గౌలికార్ అరుణ, ఆవుల మమతాసాయి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పెలిమెల్లి శ్రీధర్‌గౌడ్, సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, యువజన విభాగం అధ్యక్షుడు ముక్యర్ల సతీశ్ యాదవ్, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్లెం స్వాతి, శ్రీనివాస్, యాకూబ్, సత్యనారాయణ, భాస్కర్, క్రాంతి పాల్గొన్నారు.



యాదగిరిగుట్టలో గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ నాయకులు హరిశంకర్, రామచంద్రారెడ్డి



వివిధ పార్టీల నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

# సబ్బండ వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక

మునుగోడు, నవంబర్ 15 : సబ్బండ వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమాన్ని చూసి ప్రతిపక్షాల నుంచి భారీగా బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో మునుగోడు గ్రామపంచాయతీ కో ఆప్షన్ సభ్యుడు పాలకూరి నరిసింహగౌడ్, యాసరాణి దినేశ్, బీసం రాకేశ్, కార్తీక్, యూత్ సభ్యులు ఉన్నారు. ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బండ పురుషోత్తంరెడ్డి, నాయకులు సైదులుగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మధుకర్, విజయ్‌కుమార్, అశోక్, రాజు, రవి పాల్గొన్నారు.



మునుగోడు : గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

# సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

- బీఆర్ఎస్ మునుగోడు అభ్యర్థి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
- పసునూరుకు చెందిన 50 ముదిరాజ్ కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక

నాంపల్లి నవంబర్ 15 : ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని బీఆర్ఎస్ మునుగోడు అభ్యర్థి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మర్రిగూడెం మండలం కమ్మగూడెంలో నాంపల్లి మండలం పసునూరుకు చెందిన 50 ముదిరాజ్ కుటుంబాలు గ్రామ మాజీ సర్పంచ్ పోగుల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కూసుకుంట్ల గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వైపు దేశమంతా చూస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు తెలంగాణ ప్రజలకు చేసిందేమీ లేదని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకనే బీఆర్ఎస్‌పై విషం చిమ్ముతున్నాయని పేర్కొన్నారు. ఎవరెన్ని ఎత్తుగడలు వేసినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దండిగ సాలయ్య, పోగుల మల్లారెడ్డి, సురబోయిన రవి పాల్గొన్నారు.

మునుగోడు : మండలంలోని సింగారం గ్రామానికి చెందిన 30 కాంగ్రెస్, బీజేపీ కుటుంబాలు మంగళవారం రాత్రి ఆ పార్టీలకు రాజనామా చేసి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో కట్టుముల్ల శేఖర్‌రెడ్డి, నకిరేకంటి ఆడమయ్య, సోమగోని లింగస్వామి, నవీన్, అరవింద్, కోడి శేఖర్, బొట్టు ప్రణీత్, కొంపెల్లి శ్రీకాంత్, జినుకుంట్ల లింగస్వామి, కృష్ణయ్య, మల్లయ్య, గుర్రాల మహేశ్, నకిరేకంటి వెంకటేశ్, కోడి చంటి ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బండ పురుషోత్తంరెడ్డి, ఎంపీటీసీ పోలగోని విజయలక్ష్మిసైదులుగౌడ్, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

# 30 వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు

రామగిరి, నవంబర్ 15 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు అడ్మిషన్ల గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు నల్లగొండ డీఈఓ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని స్టడీ సెంటర్లలో అర్హులైన అభ్యర్థులు సంప్రదించి అడ్మిషన్లు తీసుకోవాలని సూచించారు.